విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

దాళ్వా సాగులో పి.ఆర్-126 వేయొద్దు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ :దాళ్వాలో ఎక్కువ మంది రైతులు పి.ఆర్ -126, ఎస్. ఎల్-10 రకం వరి సాగుకు సన్నద్ధం అవుతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందని, ఎవరైనా రైతులు ఈ రకం సాగు చేస్తే వారు ధాన్యాన్ని ప్రైవేటుగా మాత్రమే అమ్ముకోవాల్సి ఉంటుందని తెలియ చేసారు. ప్రభుత్వం పి.ఆర్.-126 మరియు ఎస్. ఎల్-10 రకం ధాన్యాన్ని కొనుగోలు చేయదని స్పష్టం చేసిందన్నారు. రైతులు వరి పంటకు నాట్లు వేసే పద్ధతి కాకుండా నేరుగా విత్తనాలు వెదజల్లే పద్ధతిని అలవాటు చేసుకోవాలని సూచించారు. రైతులు దాళ్వాసాగులో వ్యవసాయ శాఖ వారి సూచనలు పాటిస్తూ మంచి దిగుబడులు సాధించాలని జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ తెలియచేసారు.

యూనియన్ బ్యాంక్ ఆవిర్భావ వేడుకలు

విశాలాంధ్ర - మామిడికుదురు : యూనియన్ బ్యాంక్ ద్వారా ప్రజలకు అందిస్తున్న వివిధ రకాల ఋణాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని పాసర్లపూడి సర్పంచ్ కోనుకు ప్రేమ జ్యోతి నాగరాజు అన్నారు. శుక్రవారం యూనియన్ బ్యాంక్ 105 వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు పాశర్లపూడి బ్రాంచి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం బ్రాంచి మేనేజర్ పి. వీరబాబు మాట్లాడుతూ తమ బ్రాంచి రూ.10 కోట్ల డిపాజిట్లు కలిగి ఉందని, రూ.25 కోట్లను వివిధ రకాల ఋణాలుగా ఇచ్చినట్లు తెలిపారు. ముద్ర, హౌసింగ్, పిఎమ్ఈ. జీపి డ్వాక్రా, విద్యా ఋణాలు అందిస్తున్నామని వాటిని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. తమ బ్యాంక్ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తోరం భాస్కరరావు, వాకపల్లి వీరాస్వామి, బొరుసు సత్తిబాబు, వేగి లక్ష్మినారాయణ, తోలేటి ఆదినారాయణ, కుసుమ శివ, అసిస్టెంట్ మేనేజర్ జి. బాలకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొండుకుదురులో అగ్నిప్రమాదం

విశాలాంధ్ర - అయినవిల్లి : మండలంలోని కొండుకుదురులో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో అబ్బిరెడ్డి సుబ్రమణ్యేశ్వరరావుకు చెందిన తాటాకుల ఇల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఆ ఇంట్లోని ఆధార్ కార్డులు రేషన్ కార్డులు, వస్త్రాలు, నిత్యవసర వస్తువులు, సామాగ్రి పూర్తిగా కాలిపోవడంతో సుబ్రమణ్యేశ్వరరావు కుటుంబంతో పాటు నివశిస్తున్న గుమ్మళ్ళ సరేష్ కుటుంబం కట్టుబట్టలతో వీధిన పడ్డారు. మహిళలు వంట చేస్తుండగా నిప్పురవ్వలు రేగి ఇంటి కప్పు అంటుకుని మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ముమ్మిడివరం ఇన్‌ఛార్జి అగ్నిమాపక అధికారి కెవిఎస్ కొండ బాబు, తన సిబ్బందితో కలసి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మంటలను అదుపు చేశారు. కానీ అప్పటికే ఇల్లు, ఇంట్లోని సామాగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఆస్థి నష్టం సుమారు రూ. మూడు లక్షల వరకు ఉంటుందని స్థానికులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆ గ్రామ సర్పంచ్ మేడిది దుర్గా ప్రసాద్ పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం సరఫరా చేసిన 50 కేజీల బియ్యం అందించారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

-రూ.2లక్షల ఆస్థి నష్టం

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం ఆదిలక్ష్మి నగర్‌లో గురువారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ఫ్రిడ్జ్ నుంచి మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదిలక్ష్మి నగర్ మూడో వీధిలో నివాసముంటున్న రషీద్ అత్తర్ రెండు రోజుల క్రితం బంధువులు ఇంటికి వెళ్లారు. గురువారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా ఫ్రిడ్జ్ నుంచి మంటలు ప్రారంభమై ఇల్లంతా వ్యాపించాయి. స్థానికులు కొత్తపేట ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ఎఫ్ఓ శ్రీనివాసరావు, జగదీష్ బాబు, కెవిపి ప్రసాదు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ ఇంజన్ సాయంతో మంటలను అదుపు చేసారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని ఇన్వర్టర్, ఏసీ, ఫ్రిడ్జ్, టీవీ, విద్యుత్ మీటర్ తదితర వస్తువులు దగ్ధమయ్యాయని సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని ఫైర్ అధికారులు తెలిపారు.

రామకృష్ణకు సత్కారం

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం, కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లో అందించిన సేవల్ని గుర్తించి రామకృష్ణను వివి వినాయక్ సేవా యూత్ సర్కిల్ సత్కరించింది. మండల పరిధిలోని ఈతకోట గ్రామానికి చెందిన శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయ కమిటీ చైర్మన్ వెలిగట్ల రామకృష్ణను వివి వినాయక్ సేవా యూత్ సర్కిల్ సభ్యులు గంధ్రోతు దుర్గాసురేష్, దుర్గాదేవి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అమ్మవారి ఆలయ సన్నిధిలో శుక్రవారం అమ్మవారి ఆశీస్సులతో వినాయక్ సేవా యూత్ సర్కిల్ సభ్యులు రామకృష్ణను దుశ్శాలువా కప్పి ఆయనకు మెమెంట్ అందజేసి చిరు సత్కారం చేశారు. అనంతరం ఆలయ కమిటీ మాజీ చైర్మన్ యర్రంశెట్టి సతీష్‌బాబు పాల్గొని వెలిగట్లను అభినందించారు. ఈ సందర్భంగా పలువురు పెద్దలు, యువకులు అభినందించారు.

గోదావరి హారతికి పగడ్బందీ ఏర్పాట్లు

విశాలాంధ్ర-కొవ్వూరు : గోదావరి హారతి కార్యక్రమానికి అధికారులు పగడ్బందీ ఏర్పాట్లు చెయ్యాలని కొవ్వూరు మునిసిపల్ కమిషనర్ బి. శ్రీకాంత్ అన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో గోదావరి హారతి ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ... ఈ నెల 20 వతేదీన గోష్పాద క్షేత్రంలో గోదావరి హారతి కా ర్యక్రమం నిర్వహించడం జరు గుతుందన్నారు. గోష్పాద క్షేత్రం లో 21 సేఫ్టీ బోట్లు, ఒక రెస్క్యూ బోట్ తగిన సంఖ్య లో గజ ఈత గాళ్లను ఏర్పాటు చేయా లని మత్స్య శాఖ, ఏ. ఐ. ఎఫ్, పి. కృష్ణ వేణిని ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం అవసరమైన చర్యలు తీసు కోవాలన్నారు.

గోకవరంలో భారీ ప్రదర్శన

విశాలాంధ్ర - గోకవరం : రాష్ట్ర అటవీ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకుని ఇందుకూరుపేట అటవీ సిబ్బంది శుక్రవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అటవీ సిబ్బంది ఇందుకూరుపేట రేంజ్ కార్యాలయంలో ఎఫ్ఆర్ఓ దుర్గా కుమార్ ఆధ్వర్యంలో అటవీ రక్షణలో అమరులైన అటవీ సిబ్బందికి ఘన నివాళులర్పించి రెండు నిమిషాల పాటు సిబ్బంది అందరూ మౌనం వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ దుర్గా కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినాన్ని ప్రతి సంవత్సరం నవంబర్ 10వ తేదీన జరుపుకుంటామని తెలియజేశారు. గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ చేతిలో ప్రాణాలు కోల్పోయిన ఐఎఫ్ఎస్సి అధికారి పందెల్లపల్లి శ్రీనివాస్ స్మారకార్థం ప్రతి సంవత్సరం అటవీ అమరవీరుల సంస్మరణ దినాన్ని జరుపుకుంటున్నట్టు ఇందుకూరుపేట రేంజ్ అధికారి దుర్గా కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రేంజ్ సిబ్బంది పి. రాజ్యలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్, సెక్షన్ అధికారులు శేఖర్ బాబు, పి. శ్యాం కుమార్, హరీశ్వర్ పి. వీరన్నదొర, కే రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- జాయింట్ డైరెక్టర్ బోసుబాబు
- జీపీఎస్ ఉన్న వాహనాల్లో మాత్రమే ధాన్యం తరలించాలి
- వాటికే రైతు ఖాతాల్లో సొమ్ములు జమ

విశాలాంధ్ర - మండపేట : రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వరి రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వి. బోసుబాబు అన్నారు. జిల్లాలో రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రారంభించిన ఆర్‌బీకే, సొసైటీల వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల పరిశీలన చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం ఆయన మండపేట మండలంలోని ఆర్బీకేలు, పట్టణంలోని సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాన్ని సందర్శించారు. సొసైటీ ప్రెసిడెంట్ పెంకే గంగాధర్‌తో కలిసి పరిశీలించారు. గోడౌన్‌లో రైతుల కోసం నిల్వ ఉంచిన గోనె సంచులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేడీ బోసుబాబు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. దళారీ వ్యవస్థను అరికట్టడం కోసమే ఎక్కడికక్కడ ప్రభుత్వం ఈ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తరలించడానికి అవసరమైన వాహనాలను ఏర్పాటు చేశామని, పర్యవేక్షణ కోసం వాటికి జీపీఎస్ సిస్టం అమర్చామని పేర్కొన్నారు. మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, ఆలమూరు, రామచంద్రపురం మండలాల్లో కోతలు మొదలయ్యాయని, శుక్రవారం నాటికి 5200 ఎకరాల్లో వరికోతలు పూర్తయినట్టు తెలిపారు. ధాన్యం సేకరణ కోసం జిల్లా వ్యాప్తంగా 374 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. 2.73 లక్షల గోనెసంచులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని జేడీ బోసుబాబు విజ్ఞప్తి చేశారు. ఏడీ కె నాగేశ్వరరావు, ఏవో కె ఏసుబాబు, సొసైటీ సీఈఓ సీహెచ్ సుబ్రహ్మణ్యం, రైతు తాడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కాకినాడ : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో అన్ని గ్రంథాలయాల్లో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టరు డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. శుక్రవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ గ్రంథాలయ అధికారులతో కలిసి 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కృతికా శుక్లా మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రంథాలయ నిర్వాహకులందరూ ఈ వారోత్సవాలను సక్రమంగా నిర్వహించడం ద్వారా ఎక్కువ మంది పాఠకులు గ్రంథాలయాలకు వచ్చేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వివిఎల్ఎస్‌ఎస్వీ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ ఎల్ వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ కె. కిషోర్, లైబ్రేరియన్ ఎం. శ్రీనివాసరావు, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది సలాది రాజు, డి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవభావం కలిగి ఉండాలి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ రామకృష్ణారావుపేట మదీనా ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో అలయన్స్ క్లబ్ ఆఫ్ వివేకానంద ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షురాలు అలై కె రజినీగౌరీ అధ్యక్షతన కీర్తి శేషులు చంద్రరావు వర్ధంతి సందర్భంగా వారి కుమారులు అప్పలరాజు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ అలై డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, విశిష్ట అతిథిగా క్లబ్స్ వైస్ గవర్నర్ అలై వనుం శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునే స్వభావం కలిగి ఉండాలని అన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ తల్లిదండ్రులు దైవంతో సమానమని చంద్రరావు మన మధ్య లేకపోయినా ఆయన జ్ఞాపకార్థం వృద్ధాశ్రమంలో అన్నదానం చేయడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో అఖిల్, మాధురి, జోన్ చైర్మన్ అలై గోపిరెడ్డి, అలై వనుం ఉపేంద్రనాథ్ పాల్గొన్నారు.

3 టన్నుల పిడిఎస్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర - జగ్గంపేట : విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం జగ్గంపేటలో దాడి చేసి 3 టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. జగ్గంపేట ఎమ్ఎస్ఓ జి. మురళీ మోహన్ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కిర్లంపూడి మండలం గోనేడ గ్రామానికి చెందిన నల్లంశెట్టి లక్ష్మణరావు గోనేడ గ్రామం నుండి బొలెరో వ్యాన్‌లో పిడిఎస్ రైస్ తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. 60 ప్లాస్టిక్ బ్యాగుల్లో పిడిఎస్ రైసును మల్లిశాల వైపు తీసుకుని వెళుతుండగా విజిలెన్స్ అండ్ సివిల్ సప్లై అధికారులతో కలిసి పట్టుకున్నట్టు తెలిపారు. పిడిఎస్ రైస్ స్వాధీనం చేసుకుని ఎమ్ఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జికి అప్పగించినట్టు ఎమ్ఎస్ఓ తెలిపారు. లక్ష్మణరావు పై క్రిమినల్ కేసు నమోదు చేయమని జగ్గంపేట సబ్ ఇన్స్పెక్టర్‌కు నివేదించడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో రీజినల్ విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, కె. కుమార్ ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు

విశాలాంధ్ర - రాజానగరం : జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు చేకూరుతుందని ఇన్ చార్జి ఎంపిడివో ఎం.సుబ్రమణ్యం అన్నారు. మండలంలోని శ్రీరాంపురంలో గ్రామంలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో తొలుత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని వైద్య పరీక్షలతో పాటు వైద్యులు సూచించినట్లు చెప్పారు. వైద్య శిబిరాలను మండల వ్యాప్తంగా ప్రతి గ్రామాలలో నిర్వహించేటప్పుడు ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలో పలువురు రోగులకు బిపి,షుగర్ మొదలగు వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులతో పాటు జగనన్న కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, పిహెచ్.సి వైద్యులు,సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

3వ మైత్రి కమిటి సమావేశం

విశాలాంధ్ర - తాళ్ళపూడి : తాళ్లపూడి మండలంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి 3 వ మైత్రి కమిటీ సమావేశం శుక్రవారం తాళ్లపూడి మండల పరిషత్ కార్యాల యంలో నిర్వహిం చారు. ధాన్యం కొనుగోలులో ఏ విధమైన ఇబ్బందులు లేకుండా ముందుగానే గోనె సంచులు ఆర్.బి.కె లలో పెట్టించడం జరిగిందని, జి.పి.ఎస్ ఉన్న వాహనాలు మాత్రమే ధాన్యం కొనుగోలులో వినియోగించాలని మండల తహశీల్దార్ రాధిక తెలిపారు. ఎంపీడీఓ రమణ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా జరిగేందుకు మండల, డివిజనల్, జిల్లా కార్యాలయాలలో కంట్రోల్ రూం లు ఏర్పాటు చేసినట్లు రైతులు ధాన్యం కొనుగోలులో ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే నేరుగా ఆర్.బి.కె లేదా మండల కేంద్రాల్లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వివేకానంద పార్క్ అభివృద్ధికి చర్యలు

విశాలాంధ్ర - కాకినాడ : సందర్శకులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా వివేకానంద పార్కును అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు హామీ ఇచ్చారు. వివేకానంద పార్క్ వాకర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు కమిషనర్ నాగ నరసింహారావు శుక్రవారం పార్కును సందర్శించారు. పార్కు నిర్వహణ, అక్కడి సమస్యలను పరిశీలించారు. పార్కు ఆవరణలో సునకాల బెడద, టాయిలెట్స్ నిర్వహణ సక్రమంగా లేకపోవడం, వాకింగ్ ట్రాక్ ఇబ్బందులతో పాటు మరికొన్ని సమస్యలను వాకర్స్ సభ్యులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరంగా పార్కు అభివృద్ధికి తమ వంతు తోడ్పాటు ఎల్లప్పుడూ అందిస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి కేవలం నగరపాలక సంస్థ పైనే ఆధారపడకుండా పార్కుసకు వచ్చే అసోసియేషన్ సభ్యులు సేవా దృక్పథంతో ఆలోచించి చిన్న చిన్న సమస్యలను సొంతంగా పరిష్కరించుకునేందుకు ముందుకు రావాలన్నారు. వివేకానంద పార్క్ ఆవరణలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న స్కేటింగ్ రింగ్ నిర్మాణం పూర్తి కావస్తోందని, త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరి శ్రీనివాస్, కార్యదర్శి నేమాని సత్యనారాయణ, కోశాధికారి ఆంజనేయులు, సభ్యులు కమిషనర్ వెంట ఉన్నారు.

ఉచితంగా లైసెన్స్ అందించేలా చర్యలు

విశాలాంధ్ర - పిఠాపురం టౌన్ : ఆటో నడిపే ప్రతీ ఒక్కరికి లైసెన్స్ తప్పనిసరిగా వుండాలని, లైసెన్స్ లేని డ్రైవర్లు ఎవరైనా ఉంటే పేర్లు తమకు ఇస్తే రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా లైసెన్స్ ఇప్పించేలా చర్యలు చేపడతామని పిఠాపురం సీఐ శ్రీనివాస్ అన్నారు. స్థానిక మునిసిపల్ కళ్యాణ మండపంలో ఆటో డ్రైవర్లతో పిఠాపురం సీఐ శ్రీనివాస్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి ఎవరూ ఆటో నడపరాదని అన్నారు. పిఠాపురం ఆధ్యాత్మిక క్షేత్రం కాబట్టి దేశం నలుమూలల నుండి భక్తులు వస్తారని వారి వద్ద అధిక చార్జీలు వసూలు చెయ్యరాదని హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణంలో ఉన్న 15 ఆటో సంఘం నాయకులు, కార్మికులు ఉండగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం అడిషనల్ ఎస్సై సత్యనారాయణ తదితర పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - ఆలమూరు : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట శాసన సభ్యులు ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆలమూరు మండలంలోని మడికి గ్రామంలో ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు నేతృత్వంలో సర్పంచ్ ఉండ్రాజువరపు లక్ష్మీమౌనిక ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే బడుగువాణిలంక గ్రామంలో సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి సత్తిబాబు ఆధ్వర్యంలో పేదలందరికీ ఇండ్ల స్థలాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని 166 మంది లబ్ధిదారులకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేశారు. అనంతరం మడికి గ్రామంలో గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని గ్రామమంతటా పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, మండల వైకాపా కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, గ్రామ ఉపసర్పంచ్ పడమటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు దంతాలను పరిరక్షించుకోవాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: విద్యార్థులు దంతాలను ఎప్పటికప్పుడు పరిరక్షించుకోవాలని దేవరపల్లి బిహెచ్ఎస్ ఆర్ అండ్ బి ఎల్ ఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాల చైర్ పర్సన్ దొడ్డికర్ల మేరీ కమల, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డి.సువర్ణ రాజు పేర్కొన్నారు. దేవరపల్లిలో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని కళాశాల ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మేరీ కమల, సువర్ణ రాజు మాట్లాడుతూ ఆరోగ్యానికి దంతాల పరిరక్షణ కూడా ఎంతో అవసరమని అన్నారు. ఇతర వ్యాధుల పరిరక్షణతో పాటు దంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రపరచుకోవాలని అన్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ బి. రాజశేఖర్, డాక్టర్ జి. అన్వేష్ వైద్య సేవలు అందించారు. వీరితో పాటు మరో 20 మంది జూనియర్ డాక్టర్లు కూడా వైద్య సేవలు అందించారు.

ఆదిత్య విద్యా ప్రాంగణంలో కబడ్డీ పోటీలు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్య ప్రాంగణంలో జరుగు తున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ (పురుషులు) టోర్నమెంట్ 2023 పోటీలు హోరా హోరీగా ఆద్యంతం రసవత్త రంగా సాగు తున్నాయి. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలలో రెండవ రోజు వివిధ టీమ్‌ల మధ్య జరిగిన పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. దక్షిణాది (ఆంధ్ర, తెలంగాణా, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి) ఆరు రాష్ట్రాలకు చెందిన 113 యూనివర్సిటీలకు చెందిన 95 టీమ్‌లు సుమారు 1200 మంది ఆటగాళ్లు ఈ పోటీల్లో పాల్గొని తమతమ ప్రావీణ్యాన్ని చూపుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

విశాలాంధ్ర- కొవ్వూరు : సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. దొమ్మేరు గ్రామంలో 58 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన సచివాలయ భవనం, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. దొమ్మేరులో హోంమంత్రి తానేటి వనిత ముఖ్యఅతిథిగా హాజరై శిలాఫలకాలు ఆవిష్కరించి, రిబ్బన్ కత్తిరించి నూతన భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ నవరత్నాల ద్వారా గ్రామంలోని వివిధ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా జగనన్న ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు.

రేపటి నుంచి రోడ్ కం రైల్వే వంతెనపై రాకపోకలకు అనుమతి

విశాలాంధ్ర-కొవ్వూరు : నవంబర్ 11 ఉదయం 9 గంటల నుంచి రోడ్ కం రైల్ వంతెన రహదారి పై వాహనాల రాకపోకలు అనుమతి ఇవ్వనున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత తెలిపారు. రోడ్ కం రైల్ వంతెన మరమ్మత్తులకై సెప్టెంబర్ 27 నుంచి నవంబర్ 10 వ తేదీ వరకు రహదారిపై వాహనాల ట్రాఫిక్ ను నియం త్రించినట్టు తెలిపారు. ప్రస్తుతం గోదావరీ వంతెన మరమ్మతులు పూర్తి అవ్వడం వల్ల సాధారణ వాహనాలు లైట్ వెయిట్ వాహనాల ట్రాఫిక్ నిబంధనలు మేరకు అనుమతించడం జరుగుతుందని అన్నారు. ఆర్ అండ్ బి అధికారుల సూచనలు మేరకు మోటార్ సైకిళ్ళు, లైట్ మోటార్ వెహికల్స్, ఆటోలు, ఏపిఎస్ ఆర్టీసి పల్లె వెలుగు బస్సులు (లగేజ్ గ్యారేజ్ లేకుండా) మాత్రం అనుమతించనున్నట్టు పేర్కొన్నారు.

క్రీడలతో మానసిక దృఢత్వం: ఎమ్మెల్యే సత్తి

విశాలాంధ్ర-అనపర్తి : క్రీడలతో శారీరక దృఢత్వం, చదువుతో మానసిక దృఢత్వం పెంపొందుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జిబిఆర్ విద్యాసంస్థల్లో భాగమైన గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే ఇంట్రా స్పోర్ట్స్ కాంపిటీషన్ ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, సిఐ శివ గణేష్, ఎస్ఐ జగన్మోహన్‌రావు పాల్గొనగా ఎమ్మెల్యే సత్తి ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సిఐ శివ గణేష్ మాట్లాడుతూ శారీరక దృఢత్వానికి, మనోవికాశానికి ఆటలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం వంద మీటర్ల పరుగు పందెం సీఐ, క్రికెట్ క్రీడ ఎస్ఐ ప్రారంభించారు. విద్యాసంస్థల అధినేత మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు ఉత్తమ క్రీడాకారులుగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిబిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డీన్ జి. హరిప్రసాద్, హెచ్ఎం రామారావు, ప్రైమరీ హెచ్ఎం భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటలు ముఖ్యమే

విశాలాంధ్ర - రాజానగరం : నిత్యం తరగతి గదుల్లో ఉండే చిన్నారులకు చదువులతో పాటు ఆటలు సైతం ముఖ్యమేనని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. విద్యార్థులకు ఎంతో ఇష్టమైన బాలల దినోత్సవాన్ని పురస్కరిం చుకొని మండలంలోని దివాన్ చెరువు గ్రామంలోని సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాలల దినోత్సవ వేడుకలు వారం రోజులు ముందుగానే ఘనంగా ప్రారంభమయ్యాయి. బాల బాలికలకు రోజు విడిచి రోజు వివిధ క్రీడా పోటీలు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా పరుగు పందెం, వాటర్ బాల్స్, ఫ్రాగ్ జంప్(కప్ప గంతులు),మ్యూజికల్ చైర్స్, రింగ్ గేమ్ వంటి పోటీలలో సీనియర్స్, జూనియ ర్స్ విభాగాల్లో 60మంది చిన్నారులు ఆశక్తిగా పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. దీంతో ఫౌండేషన్ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. విజేతలకు త్వరలోనే బహుమతులు అందజేస్తామని ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ సుంకర వీరాస్వామి, మండలంలోని వివిధ గ్రామాల ఫౌండేషన్ సభ్యులు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తంలో జగనన్నే ఎందుకు కావాలంటే

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉప్పలగుప్తం మండల అధ్యక్షులు బద్రి బాబ్జి అధ్వర్యంలో పార్టీ నాయకులు సచివాలయం కన్వీనర్లు, వాలం టీర్స్, గృహసారదులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించి ప్రజాభిప్రాయం సేకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు గెద్దం సంపతరావు, మండల సచివాలయాల కన్వీనర్ కోటుం లోవరాజు, మండల యువజన విభాగం అధ్యక్షులు ఓగూరి విజయకుమార్, సచివాలయం కన్వీనర్లు పెయ్యల వెంకట రమణ, చీకట్ల రెడ్డినాయుడు, నీతిపూడి ఆదిలక్ష్మి, నాయకులు పందు అంబేద్కర్, తోలేటి రామకుమార్, దొనిపాటి వేణు, కొంకి మునీంద్రా, గృహసారథులు పాల్గొన్నారు.

ఏం చేశారో ప్రజలకు చెప్పి ఎన్నికలకు వెళ్ళాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : జగన్ అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఏం చేశారో చెప్పి ఎన్నికలకు వెళ్లాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రు జగ్గంపేట నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇక్కడ నుండి టిడిపి, జనసేన ఉమ్మడి ప్రణాళికలతో పనిచేయనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 52 నెలలు అవుతుందని, సామాన్యుడి నుండి సంపన్నుడు వరకూ ఒక్కొక్క కుటుంబంపైన 8 లక్షల 25 వేల 549 రూపాయలు భారం ఈ ప్రభుత్వంలో పడిందన్నారు. ధరలు విపరీతంగా పెరిగాయని, విద్యుత్తు చార్జీలు 57 వేల కోట్లు రూపాయలు భారం వేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్‌విఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : నగర పంచాయతీ పరిధిలోని కాశి వారి తూము ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. యానంకి చెందిన గనిశెట్టి శేషుబాబు బైక్ పై అమలాపురం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. శేషుబాబుని అమలాపురంలోని ఆసుపత్రికి అక్కడి నుంచి కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. దీనిపై కేసు నమోదు చేశామని ముమ్మిడివరం ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

జనరంజక మేనిఫెస్టో అవసరం

విశాలాంధ్ర - పాలకొల్లు: రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలన అంతమొందించాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి జనరంజకమైన మేనిఫెస్టో తయారు చేయడం ఎంతో అవసరమని కాపు సంక్షేమ సేన అధ్యక్షులు, మాజీ ఎంపి చేగొండి వెంకట హరరామజోగయ్య అన్నారు. శుక్రవారం పాలకొల్లులోని ఆయన నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో జోగయ్య మాట్లాడారు. రాష్ట్రంలో రూ. 75 వేల కోట్ల అంచనాలతో 47 సంక్షేమ పథకాలతో రూపొందించిన పీపుల్స్ మేనిఫెస్టో బుక్ లెట్‌ను ఈ సందర్భంగా జోగయ్య విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమీప కాలంలో టీడీపీ, జనసేన కూటమిలో బీజేపీ చేరే అవకాశం ఉందన్నారు. టీడీపీ, జనసేన కూటమి తమ సంక్షేమ పథకాలతోనే వైసీపీ ప్రభుత్వంలో అందిస్తున్న సంక్షేమ పథకాలకు దిగిపోయిన సమాధానం ఇవ్వగలుగు తామన్నారు. అన్ని వర్గాలకు చెందిన, సుమారు 200 మంది పేదలతో చర్చించి ఈ ఉమ్మడి మేనిఫెస్టో ఖరారు చేసామని జోగయ్య అన్నారు. 20 మందితో కూడిన కమిటీని వేసి వారందరి అభిప్రాయాలతో తయారు చేసిన పీపుల్స్ మేనిఫెస్టో ముసాయిదాను నాదెండ్ల మనోహర్ కు అందజేశామని జోగయ్య చెప్పారు. తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి మాత్రమే సంక్షేమం పథకాలు అందాలని ప్రతిపాదన చేశామన్నారు. జనసేన పి ఎస్ సి సభ్యులు చేగొండి సూర్య ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి 23 వరకు పల్లెకు పోదాం

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : మండలంలోని ఆయా సచివాలయాల్లో పల్లె కి పోదాం కార్యక్రమం ఈనెల 10 నుండి 23 వరకు నిర్వహించబడునని ఎంపీడీవో కే కృష్ణ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటన పేర్కొన్నారు ప్రతి వాలంటీరు ఆయా క్లస్టర్లలో ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల వివరాలను నోటీసు బోర్డులలో పెట్టేటట్లు పంచాయతీ కార్యదర్శులు చూడాలని అన్నారు పదవ తేదీన అంకన్న గూడెం 14న దర్భ గూడెం 15న జీలుగుమిల్లి 16 న కామయపాలెం 17న ములగలంపల్లి 20న పి అంకంపాలెం 21న పి రాజవరం 22న రాచన్న గూడెం 23న స్వర్ణ వారి గూడెం పంచాయతీలలో మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించబడునని ఎంపీడీవో తెలిపారు.

రహదారి నిర్మాణం పరిశీలన

విశాలాంధ్ర-మండవల్లి : హిందూ శ్మశాన వాటిక రహదారి నిర్మాణాన్ని మండవల్లి గ్రామ సర్పంచి మెండా జాన్సి శుక్రవారం పరిశీలించారు.మండలపరిషత్తు నిధులతో రహదారి నిర్మాణం జరుగుతుండగా ప్రజలకు సౌకర్యవంతంగా నిర్మాణం జరపాలని జాన్సి సూచించారు. కార్యక్రమంలో పంచాయితీ వార్డు సభ్యులు ఆగొల్లు సత్యనారాయణ, వైసిపి నాయకులు మెండా సురేష్ బాబు పాల్గొన్నారు.

సమస్యలను అధికారులకు చెబుతాం

విశాలాంధ్ర-మండవల్లి: సమస్యలను అధికారులకు వివరించి పరిష్కరించేలాగా చూస్తామని శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ అన్నారు.కొల్లేటి గ్రామమైన పులపర్రులో శ్మశాన వాటికకు దారి సౌకర్యం లేకపోవటంతో కొల్లేరులో పడవపై శ్మశానానికి తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. విషయాన్ని తెలుసుకున్న జయమంగళ శుక్రవారం పులపర్రు వెళ్లి సమస్యపై ఆరా తీశారు. అధికారులకు వివరించి ఇబ్బందులు లేకుండా చేస్తామని స్ధానికులకు హామి ఇచ్చారు. కార్యక్రమంలో స్ధానిక కొల్లేటి పెద్దలు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వరహాలరెడ్డి దంపతులు

విశాలాంధ్ర-పెంటపాడు: తాడేపల్లిగూడెం మార్కెట్ యార్డ్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత పెంటపాడు గ్రామానికి చెందిన మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కర్రి వరహాలు రెడ్డి ఆయన సతీమణి పెంటపాడు గ్రామపంచాయతీ 12 వ వార్డు మెంబర్ కర్రీ ప్రియాంక రెడ్డిలు ముప్పిడి ని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ముప్పిడి మాట్లాడుతూ పెంటపాడు గ్రామం రెడ్డి సామాజిక వర్గానికి సంబంధించి 20 సంవత్సరాల తర్వాత మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గా కర్రి వరహాలరెడ్డి నియమితులైనందుకు సంతోషంగా ఉందని పార్టీ కోసం మరింతగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా వరహాలు రెడ్డి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆశీస్సులతో ఈ పదవి నన్ను వరించిందని, పార్టీ కోసం, జగనన్న, కొట్టు గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి నా వంతు కృషి చేస్తానన్నారు. పుంత రోడ్ల నిర్మాణానికి సహకరించాలని ముప్పడిని కోరారు.

కెరీర్ గైడెన్స్

విశాలాంధ్ర-పెంటపాడు: మానవతా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో దర్శిపర్రు, కస్పా పెంటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థు లకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన మానవతా పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు తాడేపల్లి మోహన్ రావు నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ రావు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అన్నట్లు విద్యార్థి దశలో బాగా చదువుకుని మంచి ఉద్యోగాలతో, వ్యాపార రంగాలలో, అభివృద్ధి చెందాలని, ఆశిస్తున్నాన న్నారు. ఈ కార్యక్రమానికి పెంటపాడు ఎంఈఓ 2 టీవీ రామకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు శుభాశీస్సులు తెలియజేస్తూ బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. మానవతా తరఫున పుస్తకాలు పెన్నులు పదో తరగతి విద్యార్థులకు, ప్రతిభవంతులను విద్యార్థులకు ప్రధానోపా ధ్యాయులకు జ్ఞాపకాలు అందించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమ నాయకుడు కళింగ లక్ష్మణరావు,దర్శిపరు ప్రధాన ఉపాధ్యాయులు కె వి సత్యనారాయణ, కస్పా పెంటపాడు ప్రధాన ఉపాధ్యాయులు వివిఆర్ఎస్ కృష్ణ, గ్రామ పెద్దలు మల్లులను వెంకటస్వామి పాఠశాల ఉపాధ్యాయులు గంగరాజు, మురళీకృష్ణ , శ్రీనివాసరెడ్డి, నరేంద్ర కుమార్ రెడ్డి, ఉమాశ్రీ, అపర్ణ, రాధాకృష్ణ పెద్దలు పాల్గొన్నారు.

బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : రానున్న ఎన్నికల్లో టిడిపి గెలిస్తే కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించి జిల్లాలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఎక్కడికి వెళ్లినా ఉచితంగా ప్రయాణ సదుపాయం కల్పిస్తామని పోలవరం నియోజక వర్గం టిడిపి కన్వీనర్ బొరగం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం దర్భ గూడెం గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ప్రజావేదిక నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఆడబిడ్డ నిధి కింద 18 సంవత్సరాల దాటిన ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయలు అందిస్తామని అన్నారు. తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఏడాదికి 15 వేల రూపాయలు బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బి. రాజబాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు టి. సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర-ఏలూరు: పేద ప్రజల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న-వార్డుకు పోదాం 2 వ రోజు కార్యక్రమంలో భాగంగా స్థానిక కబాడీ గూడెంలో ఉన్న సచివాలయ%శీ%-1 మరియు వెంకటాపురం-5 హనుమాన్ నగర్ లో ఉన్న పరిధిలో జరిగిన మా నమ్మకం నువ్వే జగన్ వార్డుకు పోదాం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేయర్ నూర్జహాన్ పెదబాబు, వైసీపి జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ ఎం ఆర్ పెదబాబు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పదవీ బాధ్యతలు చేపట్టిన చేపట్టిన సందర్భంగా చేసిన వాగ్దానాల కంటే ఎక్కువగా సంక్షేమ పథకాలు అమలు చేశారని కొనియాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి పేదవానికి అందుతున్నాయో లేదో తెలుసుకొని గత ప్రభుత్వానికి జగన్ ప్రభుత్వానికి తేడాను లబ్ధిదారులకు తెలియ చేస్తున్నామన్నారు. ఈ సచివాలయ పరిధిలో 4 వేల 884 మంది రూ.29 కోట్ల 65 లక్షలు లబ్ధి పొందా రన్నారు. నాలుగున్నర సంవత్సరాల కాలంలో సచివాలయాల వారీగా ఉన్న లబ్ధిదారులకు ఏ లబ్ధిదారునికి ఏ పథకం ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో వివరిస్తూ ఏర్పాటుచేసిన డిస్ప్లే బోర్డును మేయర్ నూర్జహాన్ పెదబాబు ఆవిష్కరించారు. మాటల్లో కాకుండా చేతల్లో సంక్షేమం,అభివృద్ధి చేసి చూపించిన ముఖ్యమంత్రి జగన్ మళ్ళీ సీఎం కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని నూర్జహాన్ పెదబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు గుడిదేశీ శ్రీనివాసరావు,నూక పెయ్యి సుధీర్ బాబు, కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, తుమరాడ స్రవంతి, గుడిదేశి లక్ష్మి శారద,ఏఎంసీ చైర్మన్ నేరుసు చిరంజీవి, కార్పొరేటర్ ఎర్రం శెట్టి నాగబాబు,దేవరకొండ శ్రీనివాసరావు, కిలాడి దుర్గారావు,సబ్బన శ్రీనివాసరావు, నున్న కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మాజీగూడెంకు తరలివచ్చిన అధికారులు

విశాలాంధ్ర - లింగపాలెం : జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి జిల్లా అధికారులంతా ధర్మాజీగూడెం తరలివచ్చారు. కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ లావణ్య, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ నిర్వహించారు. అధికారులంతా రావటంతో ధర్మాజీగూడెంకు అధికారుల కళ చేకూరింది. కార్యక్రమంలో డిప్యూటీ సిఇఓ నిర్మలా జ్యోతి, ఎఎస్పీ భాస్కర్, సాంఘిక సంక్షేమ శాఖ జెడీ జయప్రకాష్, వ్యవసాయ శాఖ జెడీ రామకృష్ణ, విద్యుత్ శాఖ ఎడిఎ పి.శ్రీనివాస్, ఇరిగేషన్ శాఖ అధికారి పరమానందం, రోడ్లు భవనాల శాఖ అధికారి సుందరరావు, పౌర సరఫరాల అధికారి సత్యనారాయణ, పౌర సరఫర శాఖ మేనేజర్ మంజు భార్గవి, తదితర జిల్లా, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం మండలంలో నిర్వహించటాన్ని ప్రతీ ఒక్కరూ అభినందించారు. స్థానిక నాయకులు దయాల నవీన్‌బాబు, ముసునూరు వెంకటేశ్వరరావు, సొంగా సందీప్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీభీమేశ్వరఆలయ సంప్రోక్షణ

విశాలాంధ్ర-భీమడోలు: దాతల సహకారంతో ఆధునీకరించి అభివృద్ధి చేసిన భీమడోలు శ్రీభీమేశ్వరస్వామి ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. సంప్రోక్షణలో భాగంగా అర్చకులు, వేదపండితులు విశేష హెూమాలు, పూజలు నిర్వహించి ఆలయ సంప్రోక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుకు ఆలయ అర్చకులు పూర్ణకుంభం స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆలయ ఆర్చను ప్రారంభించారు. వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుబాబు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, జనసేన ఇంచార్జ్ పత్సమట్ల ధర్మరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే వాసుబాబు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, జనసేన ఇన్‌చార్జి ధర్మరాజును దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే వాసుబాబు అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీరామచంద్రమూర్తిని సత్కరించారు. అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఈవో రాధా, ఆలయఅభివృద్ధి కమిటి సభ్యులు, గ్రామస్తులు దాతలు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

విశాలాంధ్ర - కైకలూరు : మండలంలోని గోనెపాడు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గోనేపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ ప్రజా విరాళాలతో నిర్మిస్తున్న శివాలయం దాదాపు పూర్తి అయ్యిందని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ నాయకులు గోపాల్ యాదవ్, కైకలూరు నియోజక వర్గ ప్రముఖ చేపల రైతు శ్రీ జంపన రామలింగ రాజు (రాము), కైకలూరు నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సంబూరి వెంకట రామరాజు (తాడినాడ బాబు) తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే తమ ఇళ్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బయ్యనగూడెం ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్. సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. సీతంపేట గ్రామంలో మంచినీటి ట్యాంకు వద్ద మంచినీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూ ఇంటి ఆవరణలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని, నీరు నిలవ ఉండటం వలన నీటిలోని దోమలు గుడ్లు పెట్టి, వృద్ధి చెందుతాయని, దోమలు కుట్టడం దోమ కాటు వలన మలేరియా, డెంగ్యూ,చికెన్ గున్యా, వ్యాధులు వస్తాయని తెలిపారు. కొబ్బరి బొండాలు, డెస్పోసిబుల్ గ్లాసులు, పగిలిన వాడని మట్టి పాత్రలు, కుండలు, ప్లాస్టిక్ డబ్బాలలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. డ్రైనేజీ లోని సబ్బు నీరు , వాడేసిన ఆయిల్ పోయడం వలన దోమలు చనిపోతాయన్నారు. సాయంత్రం ఆరు గంటలు అయ్యేసరికి కిటికీ తలుపులు, ఇంటి తలుపులు వేసుకోవాలని , దోమతెరలు తప్పనిసరిగా వాడాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్. ఎస్.చాంన్ బాషా, హెల్త్ అసిస్టెంట్ టి.మంజునాథ్, ఎం.ఎల్.పి.హెచ్ చైతన్య, ఏఎన్ఎం వెంకాయమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

విశాలాంధ్ర -భీమవరం: పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం, భీమవరం డివిజన్ నాయి బ్రాహ్మణ ఉద్యోగ సంస్కృతిక సంక్షేమ సంఘం, భీమవరం ఏరియా మంగళ వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యం మూలపురుషులు, నాయి బ్రాహ్మణ కుల దైవం శ్రీ ధన్వంతరి స్వామి జయంతి ఉత్సవాలను శుక్రవారం మెంటేవారితోటలోని నాయి బ్రాహ్మణ సేవా సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ధన్వంతరి స్వామి ఫోటోతో నాయి బ్రాహ్మణులు మెంటే వారి తోటలో ఊరేగింపు నిర్వహించారు. జై ధన్వంతరి స్వామి అంటూ నినాదాలు చేశారు. అనంతరం పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు మల్లువలస రఘుబాబు, ఉద్యోగ సంఘం భీమవరం డివిజన్ అధ్యక్షులు మల్లు వలస శ్రీమన్నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణ కుల దైవం ధన్వంతరి స్వామి ఆశీస్సులతో నాయి బ్రాహ్మణులు సంఘటితంగా సమాజానికి ఆయుర్వేద వైద్యులుగా, మంగళ వాయిద్య కళాకారులుగా, వృత్తిదారులుగా సేవలు అందిస్తూ సమాజ ప్రగతిని కాంక్షిస్తూ తమ వంతు ధర్మాన్ని నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు

రోటరీ ఫౌండేషన్‌కు రూ.20 వేల డాలర్లు డొనేషన్

విశాలాంధ్ర - కాకినాడ : రోటరీ క్లబ్ కాకినాడ రీజియన్ తరఫున రోటరీ ఫౌండేషన్‌కు ఈ ఏడాది 20 వేల డాలర్లు అందించనున్నట్లు రోటరీ ఫౌండేషన్ రీజనల్ చైర్మన్ ఎస్‌కె అహ్మద్ తెలిపారు. కాకినాడ ఎస్ఎంఎస్ రోటరీ హాల్లో రోటరీ క్లబ్ కాకినాడ సమావేశం క్లబ్ ప్రెసిడెంట్ గోపు కాశీవిశ్వనాథ్ అధ్యక్షతన జరిగింది. అందులో భాగంగా రోటరీ ఫౌండేషన్ మంత్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఫౌండేషన్ రీజనల్ చైర్ ఎస్‌కె అహ్మద్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్‌కె అహ్మద్ మాట్లాడుతూ రోటరీ ఫౌండేషన్‌కు విరాళాలు అందిస్తే వాటి ద్వారా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలు ఉంటుందన్నారు. అనంతరం పిహెచ్ఎఫ్‌లు అందించిన పాస్ట్ గవర్నర్ కెవిఎస్ ఆంజనేయమూర్తి, పిడిజి లక్కరాజు సత్యనారాయణ్ టిక్కు క్లబ్ సీనియర్ మెంబర్స్ బూల్ చంద్ సదనాని, సీతాపతిరావు, డా ఆదిత్య సత్యప్రసన్న, అసిస్టెంట్ గవర్నర్ తడాల వరప్రసాద్, బాదం జయరామ్, చోడవరపు మూర్తి, గోపు కాశీవిశ్వనాథ్, కేబుల్ బాబీ, కళ్యాణి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దేవంలో వై ఎపి నీడ్స్ జగన్

విశాలాంధ్ర - తాళ్ళపూడి : పెద్దెవం గ్రామంలో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని రెండో వార్డ్ లో మండల ఎస్సీ సెల్ నాయకులు చిర్రా గంగారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ నాయకులు, ఏఎంసి చైర్మన్ వల్లభ శెట్టి శ్రీనివాస్, తాళ్లపూడి మండల ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ సిఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తిగురుపల్లి ప్రసాద్, గెద్దం వెంకటేష్, ఒరిగేటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అందుబాటులో బాణసంచా

విశాలాంధ్ర-కొవ్వూరు : అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జరుపుకునే పండుగ దీపావళి పండుగని, అటువంటి పర్వదినాన చిన్నారులతో కలిసి బాణసంచ వెలుగులతో ఆనందంగా జరుపు కునేందుకు అందరికీ అందుబాటులో ఉండే విధంగా సరసమైన ధరలతో శ్రీ రామ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం రమా సొసైటీ బాణాసంచా స్టాలు ప్రారంభించిందని రమా సొసైటీ అధ్యక్షులు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర తెలిపారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రమా సొసైటీ వద్ద బాణాసంచ దుకాణాన్ని రవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర మాట్లా డుతూ ప్రజలందరికీ అందుబాటులో ఉండే ధరలతో బాణాసంచా అమ్మకాలు జరుపనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమా సొసైటీ డైరెక్టర్లు గోసాల శ్రీనివాస్, బోడపాటి హనుమంతరావు, సుర్ల నగేష్, సెక్రటరీ రాధాకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ యాప్ అనుసంధానం చేసుకోవాలి

విశాలాంధ్ర - రాజానగరం : నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరు తమ చరవాణిలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ అనే యాప్ టెలిగ్రాం ద్వారా అనుసంధానం చేసుకోవాలని టీడీపీ బూత్ ఇన్ చార్జి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కొల్లంరత్నం అన్నారు. బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ అనే అంశంపై రాజానగరం క్లస్టర్‌కు సంబంధించి మండలంలోని పుణ్యక్షేత్రం గ్రామంలో బూత్, యూనిట్ ఇన్‌చార్జిలతో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు.దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ యాప్ అనుసంధానం ద్వారా ఓటర్లు తమ ఓటు హక్కు సురక్షితంగా ఉందో లేదో సులభంగా తెలుసుకోవచ్చునన్నారు. ఈ సమావేశంలో బూత్ ఇంచర్జీలు బడ్డిగా అప్పారావు,మద్దిరెడ్డి చిన్న వెంకటేశ్వరరావు,రాయుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం

విశాలాంధ్ర - అనపర్తి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నవరత్నాల పేరుతో హామీలు ఇచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామ కృష్ణారెడ్డి విమర్శించారు. శుక్రవారం అనపర్తిలో తూర్పుగోదావరి జిల్లా పార్టీ జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు తమలంపూడి సుధాకర్ రెడ్డి కార్యాలయంలో బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ పై అవగాహన కల్పించేందుకు టిడిపి అనపర్తి మండల ముఖ్య నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్‌చార్జిల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ కార్యక్రమం ప్రజల్లో నమ్మకం కలిగించడానికి బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ పేరుతో బాండు రూపంలో ప్రజలకు అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను), తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీ పరీక్షలకు విద్యార్థుల సమాయత్తం

విశాలాంధ్ర - కరప : కరప మండలం గురజనాపల్లి పప్పినీడి పాపారావు జిల్లా పరిషత్ హైస్కూల్ నందు విద్యార్థులను చెకుముకి పోటీ పరీక్షలకు 160 మంది విద్యార్థులకు శిక్షణ అందించి, 40 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్షలు నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. సాయి మోహన్ తెలిపారు. ఈ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను జిల్లాలో నిర్వహించు చెకుముఖి పోటీలకు పంపించడం జరుగుతుందన్నారు

వైసీపీని సాగనంపుదాం

విశాలాంధ్ర - కరప : ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడాలని టీడీపీ కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం కరప మండలంలోని విజయరాయుడు పాలెం గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ-జనసేన పార్టీల నాయకులతో కల్సి నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ, జనసేన అధికారంలోకి వస్తే అమలు చేసే పతకాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా రావాలని అన్నారు. వచ్చే ఎన్నికలలో టీడీపీని గెలిపించి బాబును సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు కుడిపూడి సత్తిబాబు, మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ బుంగా సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

పేద పిల్లల మనస్సులో మురళి మనోహరం

విశాలాంధ్ర - అమలాపురం : పోలీసుల్లో సామాజిక స్పృహ పేదరికం పట్ల ఆదరణ కలిగిన వ్యక్తులు కొద్ది మంది మాత్రమే ఉంటారు. వారిలో సుంకర మురళి మోహన్ ఒకరు. దిశ డిఎస్పీగా అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పని చేస్తున్న ఆయన దీపావళి పండుగ పురస్కరించుకొని మండపేట పట్టణ శివారు ప్రాంతంలో నివసిస్తున్న పేద కుటుంబానికి చెందిన పిల్లలకు కొత్త బట్టలు, స్వీట్స్ ఇచ్చి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆలోచన మేరకు, అడిషనల్ ఎస్పీ ఖాదర్ బాషా పర్యవేక్షణలో తల్లిదండ్రులకు, పిల్లల జాగ్రత్త విషయంలో మురళి మోహన్ పలు సూచనలు చేశారు. పేద పిల్లలు పట్ల మురళి మోహన్ చేసిన సేవకు ఎస్పీ శ్రీధర్ అభినందించారు.

జగన్‌ను జనం ద్వేషిస్తున్నారు

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను రాష్ట్రంలోని అన్ని వర్గాలు ప్రజలు ద్వేషిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు విమర్శించారు. శుక్రవారం నియోజక వర్గ టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆనందరావు మాట్లాడుతూ జగన్ ఇసుక దోపిడీని ద్వేషిస్తున్నారని దళితుల సబ్ ప్లాన్ నిధులు కాజేసి నందుకు ద్వేషిస్తున్నారు. దళితుల 28 పథకాలు తెసినందుకు ద్వేషిస్తున్నారు. రైతుల్ని దగా చేసారని, నిరుద్యోగుల్ని మోసం చేసారని ఇలా అన్ని వర్గాలు ఆవేదనతో రగిలిపోతున్నారని ఆనందరావు ఆరోపించారు. రాష్ట్రం జగన్ పాలనలో అధోగతి పాలయిందని, రోడ్లు సర్వ నాశనం అయ్యాయని, రవాణా వ్యవస్త చిన్నాభిన్నం అయిందని ఆనందరావు దుయ్యబట్టారు. జగన్‌ని ఈ రాష్ట్రం నుండి తరిమి వేయాలని లేకుంటే సామాన్యులకు రక్షణ లేదన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి అల్లాడి సోంబాబు, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు పెచెట్టి విజయ లక్ష్మి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఎమ్మెల్యే వేగుళ్ళ, జనసేన నేత లీలా కృష్ణ ఫిర్యాదు

విశాలాంధ్ర - మండపేట : జనసేన, తెలుగుదేశం పార్టీల నాయకులు శుక్రవారం అమలాపురంలో జిల్లా కలెక్టర్‌ను కలసి కేశవరం గ్రామంలో కుర్రవాని మెట్టలో గ్రావెల్ అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు చేసినట్లు మండపేట ఆయా పార్టీల నాయకులు తెలిపారు. జగనన్న లే అవుట్‌లలో గ్రావెల్ పోసేందుకు కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను పక్కనపెట్టి జగనన్న లే అవుట్ లలో ఒక్క లారీ గ్రావెల్ వేయలేదని తెలిపారు. ప్రతీరోజు సుమారు 1200 వందల లారీల (ఒక్కొక్క లారీ 6 యూనిట్లు) గ్రావెల్‌ను అక్రమంగా తవ్వకాలు జరిపి బయటకు అమ్ముకుని కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని విమర్శించారు. కేశవరం గ్రావెల్ తవ్వకాల వద్దకు పరిశీలించటానికి వెళ్తున్న మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ వేగుళ్ళ లీలా కృష్ణ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావును అక్కడకు వెళ్ళకుండా గత మూడు రోజులుగా పోలీస్‌లతో హౌస్ అరెస్టులు చేయించారని పేర్కొన్నారు. రాయవరం మండలంలోని వెదురుపాక, చెల్లూరు గ్రామాలలో ఉన్న జగనన్న లే అవుట్‌లలో గ్రావెల్ వేశామని చెప్పారని పేర్కొన్నారు. వెదురుపాక గ్రామంలో ఒక్క లారీ గ్రావెల్ కూడా వెయ్యలేదన్నారు. చెల్లూరు గ్రామంలో 19 లారీలు గ్రావెల్ వేసారన్నారు. ప్రస్తుతం సుమారు 18,000 వేల లారీలు గ్రావెల్ బయటకు అక్రమంగా రవాణా చేసారని పేర్కొన్నారు. కేశవరం గ్రామంలో ఉన్న గ్రావెల్‌ను జగనన్న కాలనీల్లో వేస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. చట్ట విరుద్ధంగా మైనింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అంతర్గత రహదారి పనులకు జేసీ శంకుస్థాపన

విశాలాంధ్ర -రాజమహేంద్రవరం రూరల్ : పిడింగొయ్యి గ్రామపంచాయతీ పరిధిలోని మీనాక్షి కాలనీలో 25 లక్షల రూపాయల వ్యయంతో అంతర్గత రహదారి పనులను చేపట్టనున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ తెలిపారు. శుక్రవారం పిడింగొయ్యి పంచాయతీ పరిధిలో జిల్లా పంచాయతీ అధికారి స్థానిక ప్రజాప్రతినిధులు సమక్షంలో రహదారి పనులకు జేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్టు తెలిపారు. ఆ దిశలో నేడు పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని మీనాక్షి కాలనీలో 25 లక్షల రూపాయల పంచాయతీ నిధులతో చేపట్టనున్న అంతర్గత రహదారి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామపంచాయతీ అధికారి జేవీ సత్యనారాయణ, స్థానిక నాయకులు బొప్పన సుబ్బారావు, చిర్రా రాజు, కార్యదర్శి రూప్ చంద్, సచివాలయ సిబ్బంది రవి తేజా, తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన మండల పరిషత్‌లో డిఎల్‌డిఓ సమీక్ష

విశాలాంధ్ర - కాట్రేనికోన : జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు మండల పరిషత్‌లో అందరు పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఏఎన్‌యంలతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ముఖ్య అతిదిగా డివిజినల్ అబివృద్ధి అధికారి పి. విజయ్ థామస్ పాల్గొనగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.కామేశ్వరరావు నిర్వహించారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని డిఎల్‌డిఓ సూచించారు. పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలు, సచివాలయ సిబ్బంది హాజరు, వివిధ పథకాలపై పనితీరును ఆయన పరిశీలించారు.

ఉత్సాహంగా చెకుముకి పాఠశాల స్థాయి పరీక్ష

విశాలాంధ్ర - రాజోలు : విద్యార్థులలో మూఢనమ్మకాలను తొలగించి సైన్స్ టెంపర్‌ను, శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు కృషి చేస్తున్న సంస్థ జనవిజ్ఞాన వేదిక అని అధ్యక్షుడు పివివి వర ప్రసాద్ అన్నారు. ప్రతీ సంవత్సరం నిర్వహించే చెకుముకి పాఠశాల స్థాయి పరీక్ష శుక్రవారం మలికిపురం మండలంలోని విశేశ్వరాయపురం జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో ఉత్సాహంగా నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన 8, 9, 10 తరగతుల నుండి సుమారు 1150 మంది పరీక్షకు హాజరయ్యారని మలికిపురం మండల గౌరవ అధ్యక్షుడు భేతీనీడి శ్రీనివాస్ మరియు కన్వీనర్ తులసీ రావు తెలిపారు. శుక్రవారం పాఠశాల స్థాయి పరీక్షలో 8, 9, 10 తరగతి విజేతలు ఒక టీమ్‌గా ఈ నెల 30న జరిగే మండల స్థాయి పోటీలకు సిద్ధం కావాలని నిర్వాహకులు తెలిపారు.

సిద్ధార్థ స్కూల్లో ఘనంగా దీపావళి వేడుకలు

విశాలాంధ్ర - ఆలమూరు : మండల కేంద్రమైన ఆలమూరు శ్రీ సిద్ధార్థ స్కూల్లో శుక్రవారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ ముల్లారావు దీపావళి వేడుకలను ప్రారంభించి దీపావళి ప్రాముఖ్యతను వివరించారు. హిందువులు జరుపుకునే ముఖ్యమైన పండుగలలో దీపావళి ముఖ్యమైనదన్నారు. ఈ పండుగ మన జీవితాలలో వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలియజేసారు. అనంతరం సిద్ధార్థ విద్యార్థినీ, విద్యార్థులు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.